నామినేషన్లకు ఏర్పాట్లు చేశాం

- అభ్యర్థుల కోసం హెల్పింగ్ సెంటర్
- ఆర్వో కార్యాలయం వద్ద 144 సెక్షన్
- ఇప్పటికే పొలిటికల్ పార్టీలతో అవగాహన సమావేశం
- సాక్షి ఇంటర్వ్యూలో ఆర్వోలు వీరబ్రహ్మాచారి, వెంకట్‌రెడ్డి

భానుపురి : శాసనసభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. సూర్యాపేట నియోజకవర్గంలో బరిలో నిలిచే అభ్యర్థుల నుంచి శుక్రవారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ కోసం చేసిన ఏర్పాట్లు, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు, బందోబస్తు తదితర అంశాలపై సూర్యాపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వీరబ్రహ్మాచారి, తుంగతుర్తి ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డిలను సాక్షి ఇంటర్వ్యూ చేసింది. ఏర్పాట్లపై సూర్యాపేట రిటర్నింగ్ అధికారి తెలిపిన వివరాలు ఆయన మాటల్లో..


కె.వీరబ్రహ్మాచారి, సూర్యాపేట ఆర్వో

అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల సంఘం ఈ నెల 3వ తేదీన శుక్రవారం నోటిఫికేషన్ ఇవ్వనుంది. దీంతో సూర్యాపేట నియోజకవర్గ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నాం. ఇందుకోసం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తిచేశాం. ఈ నెల 3వ తేదీ నుంచి ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ పత్రాలను స్వీకరిస్తాం. ఆ తర్వాత వస్తే తీసుకోం. నామినేషన్ల దాఖలులో అభ్యర్థులకు ఏమైన అనుమానాలు ఉంటే ఆర్వో కార్యాలయంలో


తుంగతుర్తిలో నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. ఒకరో జు ముందుగా వచ్చి అనుమానాలను నివృత్తి చేసుకోవాలి. ఇప్పటికే పొలిటికల్ పార్టీలకు ఈ అంశంపై అవగాహన కల్పించాం. ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దరఖాస్తు పత్రాలు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే 10మంది దాకా వీటిని తీసుకెళ్లారు.

ఐదుగురికే అనుమతి..!

నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు ఆర్వో కార్యాలయంలోకి ఐదుగురికే అనుమతి ఇస్తాం. అభ్యర్థి రాకుంటే నలుగురే రావాల్సి ఉంటుంది. ఆర్వో కార్యాలయం వద్ద 144 సెక్షన్ ఉంటుంది. ఇక 100 మీటర్ల వరకు అభ్యర్థికి సంబంధించిన మూడు వాహనాలను అనుమతిస్తాం. అక్కడి నుంచి కాలినడకన రావాల్సి ఉంటుంది. 200 మీటర్ల వరకు మాత్రమే ర్యాలీకి అనుమతి ఉంటుంది. ఆపై ఉండదు. నామినేషన్ పత్రాల స్వీకరణ మొత్తం వీడియో చిత్రీకరణ ఉంటుంది.

డీఎస్పీ ఆధ్వర్యంలో బందోబస్తు..!

ఆర్వో కార్యాలయం వద్ద నామినేషన్ పత్రాల స్వీకరణ సమయంలో భారీ బందోబస్తు ఉంటుంది. సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలు, ఐదుగురు ఏఎస్‌ఐలు, ఐదుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 15 మంది సివిల్ పోలీసులు, 30 మంది పారామిలటరీ సిబ్బంది విధుల్లో ఉంటారు. ఆర్వో కార్యాలయానికి 100 మీటర్ల వరకు ఎవరూ లోనికి రాకుండా ఇప్పటికే బారికేడ్లను ఏర్పాటు చేశాం.

తుంగతుర్తిలో ఏర్పాట్లు పూర్తి..


వెంకట్‌రెడ్డి, తుంగతుర్తి ఆర్వో

తుంగతుర్తి/తిరుమలగిరి : అసెంబ్లీ ఎన్నికల కోసం శుక్రవారం నుంచి నామినేషన్లను స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. సాక్షితో ఇంటర్వ్యూలో తెలిపిన వివరాలు ఆయన మాటల్లో..

తుంగతుర్తి అసెంబ్లీ నామినేషన్లను శుక్రవారం నుంచి తుంగతుర్తిలోని తహసీల్దార్ కార్యాలయంలో స్వీకరించనున్నాం. ప్రతి రోజు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుంది. నామినేషన్ల కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు పూర్తిస్థాయిలో నామినేషన్ల పత్రాలతో వచ్చి నామినేషన్లు దాఖలు చేయవచ్చు. నామినేషన్ దాఖలు చేసేవారితో పాటు మొత్తం ఐదుగురిని మాత్రమే లోపలికి అనుమతిస్తాం. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 326 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశాం. అన్ని పోలింగ్ బూత్‌లలో ర్యాంపు, ఫర్నిచర్, బాత్‌రూంలు, విద్యుత్ సౌకర్యంతో పాటు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాం. తుంగతుర్తి నియోజకవర్గంలో 2,48,556 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,24,826 మంది, మహిళలు 1,23,722 మంది, ట్రాన్స్‌జెండర్స్ 8 మంది ఉన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల్లో 196 వీల్ చైర్లు అందుబాటులో ఉంచాం.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరికలు


ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు

తిరుమలగిరి : వెలిశాల గ్రామానికి చెందిన పలువురు యువకులు తుంగతుర్తి శాసనసభ్యుడు గాదరి కిషోర్‌కుమార్ సమక్షంలో గురువారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దూపటి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ


జిల్లా జనరల్ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న అభిమానులు

భానుపురి : ఎమ్మార్పీఎస్ టీఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పడిదల రవి కుమార్ జన్మదిన వేడుకల సందర్భంగా గురువారం జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే అలేటి ఆటం అనాథాశ్రమం, వివేకానంద వృద్ధాశ్రమంలో పండ్లు పంచారు. ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకుడు జేవీ రమణ, బ్రహ్మం, పడిదల ఈదయ్య, బాలెంల శ్రవణ్, పడిదెల మహేష్, సృజన్ కుమార్, మచ్చ రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు పీపీఆర్ టీకాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కోమటిపల్లిలో గురువారం గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ మాట్లాడారు. గొర్రెలు, మేకల్లో పారుడు వ్యాధి నివారణ కోసం ఉచితంగా అందించే టీకాల కార్యక్రమాన్ని పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ టీకాలను జీవాలకు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌ఓ కేఎస్‌ఎస్. పద్మ, సిబ్బంది అర్జున్, యాకయ్య, యాదగిరి, పెంపకందారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కన్వీనర్‌గా ఇమ్రాన్


ఇమ్రాన్

అర్వపల్లి : అంబేద్కర్ సేన వరల్డ్ ఆర్గనైజేషన్ జిల్లా కన్వీనర్‌గా జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కుంచమర్తికి చెందిన షేక్ ఇమ్రాన్ నియమితులయ్యా రు. ఈ మేరకు ఆర్గనైజేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి రెడ్డిమళ్ల శ్రీనివాస్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడారు. అణగారిన వర్గాల అభివృద్ధికి కృషిచేయనున్నట్లు చెప్పారు. తన నియామకానికి సహకరించిన ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాందాస్, ప్రధాన కార్యదర్శ రెడ్డిమళ్ల శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బండారు రాజా, బెల్లంకొండ యాదగిరి, కుంభం రాజేందర్, పంతంగి వీరస్వామిగౌడ్ తదితరులు ఉన్నారు.

ఇంటి నిర్మాణం ధ్వంసం

మద్దిరాల : భూ వివాదం కారణంగా ఇంటి నిర్మాణ పనులను, ప్రహరీ, వాహనాలను ధ్వంసం చేసిన సంఘటన మద్దిరాలలో గురువారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సీఐ బ్రహ్మమురారి, మద్దిరాల ఎస్‌ఐ రవీందర్, నూతకల్లు ఎస్‌ఐ నరేష్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీందర్ మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన నవ్వుల మల్లారెడ్డి, వల్లపు అవిలయ్యలకు కొన్నేళ్లుగా భూ వివాదం నడుస్తోందన్నారు. భూ వివాదం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది. అయితే 15రోజుల క్రితం నవ్వుల మల్లారెడ్డి ఆ స్థలంలో ఇంటి నిర్మాణ పనులను చేపట్టారు. దీంతో బుధవారం అర్ధరాత్రి వల్లపు అవిలయ్య మరికొంత మందితో కలిసి వెళ్లి డోజర్ సహాయంతో ఆ ఇంటి నిర్మాణం, ప్రహరీ, కారు, ఓ బైక్‌ను పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ మేరకు బాధితుడు నవ్వుల మల్లారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

చివ్వెంల : గ్రామాల్లో సమస్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ధరావతు కుమారి బాబు నాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. కాగా సమావేశానికి 31 గ్రామ పంచాయతీలకు కేవలం ముగ్గురు సర్పంచ్‌లు హాజరుకావడంతో వారిపై ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన ఆయా శాఖల అధికారులకు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, ఎంపీడీఓ లక్ష్మీ, ఏఈలు, ఏపీఎం రాంబాబు, ఏఓ ఆశాకుమారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ కుమారి

మానవ అక్రమ రవాణాపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ప్రజ్వల సంస్థ సభ్యులు

తుంగతుర్తి : మానవ అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ చంద్రయ్య అన్నారు. గురువారం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. మానవ అక్రమ రవాణా అతి పెద్ద నేరమన్నారు. ప్రతిరోజు ఎంతో మంది యువతులు, మహిళలు అక్రమ రవాణాకు గురవుతున్నారని అన్నారు. ఉద్యోగం, సినిమా అవకాశాల పేరుతో మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నీలారాణి, శివకుమార్, శివ, సరిత, ప్రవళిక, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సమస్యలపై వినతి

ఆత్మకూర్ (ఎస్) : పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హెచ్‌ఎం శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. పాఠశాలలో మంచినీటి సౌకర్యం, మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పీఈటీ లేకపోవడంతో ఆటల్లో ప్రావీణ్యం లేకుండా పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో వై.ఐశ్వర్య, రాము, మౌనిక, సాయికుమార్, సౌమ్య, మధుప్రియ, రోహిత, స్పందన, గణేష్, లావణ్య, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటెయ్యాలి


చివ్వెంల : ప్రచారం చేస్తున్న నాయకులు


మద్దిరాల : మామిండ్లమడవలో..

సూర్యాపేట రూరల్ : అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి జగదీష్ రెడ్డిని గెలిపించాలని జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. గురువారం లక్ష్మీతండాలో ప్రచారం నిర్వహించారు.

చివ్వెంల : మంత్రి జగదీష్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు భు క్యా సంజీవ్ నాయక్ కోరారు. గురువారం మండల కేంద్రంతో పాటు వాల్యతండా, జగనాతండా గ్రామాల్లో బీఆర్‌ఎస్ మేనిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, సర్పంచ్‌లు జ్యోతి, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌కు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మల్లు కళింగారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మామిండ్లమడవ గ్రామంలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ మండల నాయకుడు మల్లు ఉపేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు కొంపెల్లి ఉమా గణేష్, వాసంపెల్లి మురళి, బూత్ ఇన్‌చార్జ్‌లు జలేందర్, మల్లేష్, భిక్షంరెడ్డి, వీరన్న, లింగమల్లు, రహమత్, యాకయ్య, కిరణ్, వెంకన్న, హుస్సేన్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలి


మాట్లాడుతున్న వట్టె జానయ్యయాదవ్

భానుపురి : దొరల పాలనకు చరమగీతం పాడాలంటే ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేసి బీఎస్పీని గెలిపించాలని సూర్యాపేట నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్యయాదవ్ అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సూర్యాపేట రూరల్ మండలం బీఎస్పీ బూత్ స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పేరుతో రూ.100 కోట్ల అవినీతి జరిగిందన్నారు. మంత్రి జగదీష్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే అవినీతి జరగలేదని నిరూపించుకోవడానికి వాణిజ్య భవన్ లేదా మార్కెట్ సెంటర్‌కు రావాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ బుక్య కాంత, మున్సిపల్ 6వ వార్డు కౌన్సిలర్ ధరావత్ నీలాబాయి, లింగ నాయక్, పాతర్లపహాడ్ సర్పంచ్ కేశబోయిన మల్లయ్య యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ శంకర్ నాయక్, మాజీ కౌన్సిలర్ కుంభం రజిత నాగరాజు, బీఎస్పీ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు చాంద్ పాషా, మీర్ అక్బర్, రామన్నగూడెం మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సూర సంధ్య వెంకన్న, మాజీ ఎంపీటీసీ ముక్కాల పద్మ సుమన్, వల్లాల సైదులు, ఉపసర్పంచ్ కుంభం సుజాత వెంకన్న, నగిరి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన బిడ్డకు అండగా ఉండాలి

పెన్‌పహాడ్ : సూర్యాపేట అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన తనను శాసన సభ్యుడిగా గెలిపించి బహుజన వాదానికి అండగా నిలవాలని బీఎస్పీ సూర్యాపేట నియోజకవర్గ అభ్యర్థి వట్టె జానయ్య యాదవ్ అన్నారు. గురువారం సింగారెడ్డిపాలెంలో ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆవుల అంజయ్య, బీంపంగి నాగరాజు, మామిడి ఉదయ్, మున్నా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించాలని ప్రచారం


దురాజ్‌పల్లి : ప్రచారం చేస్తున్న సంకినేని లక్ష్మి


మాట్లాడుతున్న కడియం రామచంద్రయ్య

దురాజ్‌పల్లి : ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని సంకినేని లక్ష్మి వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 17వ వార్డు చింతలచెరువులో మహిళలతో కలిసి ఇంటింటికీ తిరిగి సూర్యాపేట బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావును గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా బీజేపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అబిద్, కౌన్సిలర్లు మహాలక్ష్మి, సరిత, వార్డు ఇన్‌చార్జ్ జనార్దన్, సురేష్, పరిపూర్ణాచారి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పోతోజు మౌనిక, పట్టణ అధ్యక్షులు శ్యామలాదేవి, లింగరాజు, సమత, నవీన్ చారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంత పాలన సాగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. గురువారం తిరుమలగిరి మండలం జలాల్‌పురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత తొమ్మిదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని, డబుల్ బెడ్‌రూంల ఊసే లేదని విమర్శించారు. దళిత బంధు అక్రమాలకు నిలయంగా మారిందని అన్నారు.

మృతుల కుటుంబాలకు సాయం

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడం గ్రామానికి చెందిన సోమ సత్తమ్మ, అదే గ్రామానికి చెందిన మొగిలి సోమక్కలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో కాంగ్రెస్ యూత్ నాయకుడు మల్లం సతీష్ గురువారం బాధిత కుటుంబాలకు 50కేజీల బియ్యం చొప్పున అందజేసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మద్దెల రాములు, మద్దెల వెంకటనర్సు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదిన్నర ఏళ్లలో ఎంతో అభివృద్ధి


పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : గత 60ఏళ్లుగా జరగని అభివృద్ధి తొమ్మిదిన్నర సంవత్సరాల్లో జరిగిందని మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 46, 47 వార్డులకు చెందిన పిల్లల నాగరాజుతో పాటు సుమారు 800మంది మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలు అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని అన్నారు. ఈ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ, బూర బాల సైదులుగౌడ్, పాశం వేమారెడ్డి, రేణుబాబు, బొలిశెట్టి మధు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు


చివ్వెంలలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు


తిమ్మాపురంలో..

చివ్వెంల : ఎన్నికల విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పోలీస్ కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు విష్ణుమూర్తి, మధు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం మండల పరిధిలో..

అర్వపల్లి : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ బి. అంజిరెడ్డి హెచ్చరించారు. గురువారం జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురం, రామన్నగూడెం, కుంచమర్తి, అడివెంల తదితర గ్రామాల్లో సాయుధ పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పిట్టల రవి, సిబ్బంది దామోదర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విఘాతం కలిగిస్తే చర్యలు

పెన్‌పహాడ్ : ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట రూరల్ సీఐ అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని లింగాల గ్రామంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకన్నగౌడ్, చివ్వెంల ఎస్‌ఐ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నూతనకల్ : ఈ నెల 11న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాదిగ విశ్వరూప బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ చూరుగంటి అంజయ్య మాదిగ కోరారు. గురువారం మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం నూతనకల్ మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నకిరేకంటి మధుసూదన్, అధికార ప్రతినిధిగా గంగాధర్ లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా నకిరేకంటి చిన్న మధు, కార్యదర్శిగా బత్తుల అన్వేష్, చిప్పలపెల్లి సందీప్‌తో పాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ములకపల్లి రవి, పాల్వాయి బాలయ్య, పరశురాములు, శ్రీను, గంగాధర్ పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు అందని పథకాలు


పెన్‌పహాడ్ : మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

పెన్‌పహాడ్ : రాష్ట్రంలో పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందడంలేదని సూర్యాపేట బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్ రావు అన్నారు. గురువారం మాచారం, దూపహాడ్, న్యూ బంజారాహిల్స్ తండా, సీతమ్మ తండా, పొట్లపహాడ్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజా సంగ్రామ యాత్రలో ఆయన మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజలు కోరుకున్న విధంగా పరిపాలన సాగడం లేదని అన్నారు. కేంద్ర సంక్షేమ పథకాలను ప్రధాని మోదీ పార్టీలకతీతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మాత్రం కేసీఆర్ నేతృత్వంలో దుర్మార్గమైన పాలన కొనసాగుతుందని అన్నారు. అనంతరం ఆత్మకూరు మండలం పాత సూర్యాపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ వేల్పుల మల్లేష్‌తో పాటు మరికొంత మంది బీజేపీలో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోకల రాములు, మండల ఇన్‌చార్జ్ పోకల వెంకటేశ్వర్లు, గజ్జెల వెంకటరెడ్డి, తాళ్లపల్లి మధు, మామిడి సంధ్య, హరికృష్ణ, చెన్ను రమణారెడ్డి, తూముల సాయి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సీఎం ప్రకటనతో బీజేపీలోకి వలసలు

దురాజ్‌పల్లి : బీసీ వ్యక్తిని సీఎం అభ్యర్థిగా ప్రకటించడంతో పలువురు నాయకులు బీజేపీలో చేరుతున్నారని సూర్యాపేట నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు తెలిపారు. గురువారం సూర్యాపేట మున్సిపాలిటీతో పాటు తాళ్ల ఖమ్మంపహాడ్, పెన్‌పహాడ్, వల్లభాపురం గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంకినేని వారిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలకు ప్రాముఖ్యత ఇస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అన్నారు. బీజేపీలో చేరినవారిలో సలిగంటి శ్రీనివాస్, ఉప్పలయ్య, మురళీ, జయరామకృష్ణ, సత్యం, శ్రీను, రేణుక, సంజయ్, నాగరాజులతో పాటు సుమారు 200 మంది ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

నాగారం : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాతి వీరమల్లుగౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి, మందుల వెంకన్న, బత్తుల కర్ణాకర్, కల్లెట్లపల్లి రాములు, గట్టు లక్ష్మీకాంత్, లింగయ్య, యాట భాస్కర్, మల్లయ్య, జంపాల రవి, నాతి వెంకన్న ఉన్నారు.

కాంటాల పరిశీలన


ఏపూరులో కాంటాలను పరిశీలిస్తున్న అధికారి

ఆత్మకూర్ (ఎస్) : ఏపూరు ప్రాథమిక పరపతి సంఘంలో ఉన్న ఎలక్ట్రికల్ కాంటాలను జిల్లా తూనికలు, కొలతల అధికారి కె.వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వాటికి స్టాంపింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ లక్ష్మారెడ్డి, సిబ్బంది అజీమ్, జాని పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎం సురేందర్

భానుపురి : కార్తీకమాసం సందర్భంగా ఈనెల 19వ తేదీ నుంచి నాలుగు ఆదివారాల పాటు ఆర్టీసీ ఆధ్వర్యంలో పంచారామ దర్శనం కోసం ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ డి.సురేందర్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అమరావతిలోని అమరారామం (అమరలింగేశ్వరస్వామి), భీమవరంలోని సోమారామం (సోమేశ్వరస్వామి), పాలకొల్లులోని క్షీరారామం (క్షీరలింగేశ్వరస్వామి), ద్రాక్షారామంలోని ద్రాక్షారామం (భీమేశ్వరస్వామి), సామర్లకోటలోని కుమారారామం (భీమేశ్వరస్వామి) దర్శనాల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిందన్నారు. 9948303712 నంబర్‌కు ఫోన్‌చేసి రిజర్వేషన్ చేసుకోవచ్చని, ఫోన్‌పే, గుగుల్‌పే ద్వారాను చార్జీలను చెల్లించే వెసులుబాటు ఉందన్నారు. వివరాలకు 9032153066, 8247799393, 9951613278, 7382835305 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగరత్న, బస్టాండ్ ఇన్‌చార్జ్ ఖదీర్, పంచరామాల ఇన్‌చార్జ్ రవినాయక్, జి.ఏకాంబరం, డీజీ.రాజులు, ఎం.భాస్కర్, వీరయ్య, ఆర్.కిషన్ పాల్గొన్నారు.

పలువురికి డాక్టరేట్

అర్వపల్లి : పీహెచ్‌డీ పట్టా సాధించిన అంబేద్కర్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని జాజిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు, యోగాచార్య అవార్డు గ్రహీత డాక్టర్ పగిళ్ల సైదులు కోరారు. జాజిరెడ్డిగూడేనికి చెందిన గొల్ల బోయిన అంబేద్కర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన సందర్భంగా ఆయనను గురువారం పాఠశాలలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయులు గొల్ల బోయిన అక్కులు, ఎల్లంల కొమిరెల్లి, ఎంజీ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనురాధ, పూర్వ విద్యార్థులు బింగి కృష్ణమూర్తి, రింగు నరహరి, ఆర్. కరుణకుమార్, బి.నరేష్, ఉపాధ్యాయులు ఆర్. సుగుణ, జి. ఇందిర, వై. మధుసూదన్‌రావు, జి.మంజుల పాల్గొన్నారు.

కిన్నెర పరమేష్‌కు..

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కిన్నెర పరమేష్ జాతీయస్థాయిలో డాక్టరేట్ సాధించారు. జాతీయస్థాయి యూజీసీ - జేఆర్‌ఎఫ్ పరీక్షలో అర్హత సాధించి చరిత్ర విభాగంలో తెలంగాణలో కోయ జాతి - సామాజిక, ఆర్థిక పరిస్థితులు అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంలో పద్మశ్రీ శాంతన్ నారాయణ్, ఎడోబ్ అమెరికా సీఈఓ, ఓయూ వీసీ రవీందర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. అతడు గ్రూప్ - 1లో సైతం సెలక్ట్ కావడంతో పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి లింగయ్యతో పాటు పలువురు ఉపాధ్యాయులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

అనంతారం వాసికి..

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన షేక్ హస్సేన్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందాడు. ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా పట్టా అందుకున్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలి


మాట్లాడుతున్న నాగార్జున్‌రెడ్డి

దురాజ్‌పల్లి : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలోఆయన మాట్లాడారు. మతోన్మాద విధానాలు అనుసరిస్తున్న బీజేపీని, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న బీఆర్‌ఎస్‌లను ఓడించాలన్నారు. సూర్యాపేట జిల్లాలో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో పోటీ గురించి త్వరలో చర్చించి చెబుతామన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దిరావత్ రవి నాయక్, బుర్రి శ్రీరాములు, మట్టిపెల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నగరపు పాండు, చెరుకు ఏకలక్ష్మి, కోట గోపి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో కాంటాలు ప్రారంభం


వేల్పుచర్లలో ధాన్యం కాంటాలను ప్రారంభిస్తున్న మండల వ్యవసాయ అధికారి శశిధర్‌రెడ్డి

అర్వపల్లి : రైతులు ధాన్యంలో 17శాతంలోపు తేమ ఉండేలా చూసుకొని కేంద్రాలకు తేవాలని మండల వ్యవసాయ అధికారి ఆర్. శశిధర్‌రెడ్డి కోరారు. వేల్పుచర్లలో ఎన్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో గురువారం కాంటాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శోభారాణి, సెంటర్ నిర్వాహకుడు ఖమ్మంపాటి నరేష్, రైతులు శంకర్, మధు, అశోక్, కిరణ్, సైదులు, జాని, అంజయ్య, వెంకన్న, యాదయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.